''సమాజం మారుతోం ది శాంతా ! ఇంకా ఆడ మగ తేడా లేమిటి? మన పిల్లలు పెళ్ళీడు కొచ్చేసరికి సమసమాజం ఏర్పడుతుం''దని అంటాడు అతడు.
''అదంతా మీ భ్రమ ! పశు గుణాలను, రాక్షస ప్రవృత్తిని పెంచుకుంటున్న మానవులు - నీతుల్నీ, ఆదర్శాలనీ తమ స్వార్థానికి ఉపయోగించుకుంటారు కానీ, సమాజ శ్రేయస్సుకు ఉపయోగించరు'' అంది ఆమె.
అతడి ఆశకు, ఆమె నిరాశకు మధ్య ఉన్న దూరాన్ని చకచకా కొలిచే కథ !

# బతికిన ఊపిరి

కప్పగంతుల మల్లికార్జున రావు



''ఏమోయ్ ప్రభాకరం ! ఇటు.. ఇటు ...''

మొహం చాటవేసి పారిపోదా మని ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. జగన్నాథం నన్ను పట్టేసుకున్నాడు.

''ఇ దేమిటోయ్ ! ఇంకా ఇక్కడే ఉన్నావు? పెళ్ళి నాలుగు రోజుల్లోకి వచ్చింది కదా? ఊరు వెళ్ళి పెళ్ళి ఏర్పాట్లు చేస్తున్నా వనుకున్నానే ! నిన్ననే పెళ్ళి కూతురు తండ్రి కలిశాడు. పెళ్ళి ఎలా చేస్తావో, ఏమో నని ఒకటే ఆందోళన పడిపోయా డనుకో. అవును మరి ! పిల్లవాడు బాగా చదువుకున్నవాడు. టాప్ పొజిషన్‌లో ఉండి సంపాదించుకుంటున్న వాడు. బొంబాయి నుంచి ఫ్రెండ్స్‌తో వస్తాడు. నీ వియ్యంకుడుగారు మాత్రం సామాన్యులా ! రోటరీలు, లయన్స్ ... చాలామందితో కాంటాక్ట్సు ఉన్న పెద్దమనిషి. పైగా చివరి కొడుకు. ఇప్పట్లో మరో శుభకార్యం జరిగే అవకాశం లేదు కదా? వారి గౌరవ మర్యాదల కేం లోపం లేకుండా పెళ్ళి ఘనంగా జరిపిస్తా వని నేను చెప్పా ననుకో. మరి నా మాట నిలపాలి నువ్వు. ఏమంటావ్?''

నడిబజార్లో స్వేచ్ఛగా ఏడవనన్నా ఏడవలేని మధ్య తరగతి మనిషిని నేను.

అంచేత మనసులో ఏడుస్తూ పైకి నవ్వాను.

''అలాగే బాబాయి గారూ ! మా వాళ్ళంతా నిన్ననే ఊ రెళ్ళారు. నేనూ వెళ్ళవల్సిన వాడినే. కానీ ఇక్కడ కాస్త పని మిగిలిపోయింది. ఈ వేళ ఆ పని చూసుకుని వెళ్తున్నాను.'' ఆయన్ని వదిలించుకుని ఎలాగో బయటపడ్డాను.

బాంక్‌కి పరుగు తీశాను.

చిన్నప్పటి నుంచి నేను అభ్యుదయ భావాలు కలవాడిగా పేరుబడ్డాను.

పేదల పట్ల పక్షపాతిని. మనుషులు మౌలికంగా మంచివారని నా విశ్వాసం. దొంగతనాలు, వ్యభిచారం, మోసాలు సంఘంలో పెరగటానికి కారణం ఆర్థిక అసమానతలే కారణం అని వాదించేవాడిని.

ముగ్గురు ఆడపిల్లలు పుట్టినప్పుడే నేను విచారించలేదు.

''సమాజం మారుతున్నదోయ్ శాంతీ ! ఇంకా ఆడా, మగా తేడా లేమిటి? మన పిల్లలు పెళ్ళీడు కొచ్చేసరికి సమ సమాజం ఏర్పడుతుంది చూడు.'' నా భార్య శాంతికి ధైర్యం చెప్పాను.

''అ దంత మీ భ్రమ ! పశుగుణాలను, రాక్షస ప్రవృత్తిని పెంచుకుంటున్న మానవులు - నీతుల్నీ ఆదర్శాలనీ తమ స్వార్థానికి ఉపయోగించుకుంటారు కానీ సమాజ శ్రేయస్సుకు ఉపయోగించరు.'' రెండు ముక్కల్లో నా విశ్వాసాన్ని కొట్టిపారేసింది శాంతి.

అయినా ఎవరో ఒక మహాపురుషుడో, ఏదో పార్టీ సమసమాజాన్ని స్థాపిస్తుందని, మానవుల్లో దైవత్వం పెంచే చర్యల్ని తీసుకుంటుం దన్న ఆశను చంపుకోలేదు నేను.

ఇరవై ఏళ్ళకి పైగా గడిచిపోయాయి. నా పిల్లలు పెద్దవా ళ్ళయ్యారు. చదువుకున్నారు.

పెద్దమ్మాయి పెళ్ళి ప్రయత్నాలు

ప్రారంభించాను. అప్పుడు గానీ నా విశ్వాసాలు, ఆదర్శాలు ఎంత డొల్లవైనవో గుర్తించ లేకపోయాను.

మా పెద్దమ్మాయి అరుణకు అందం ఉంది, చదు వుంది.

అయినా "అమ్మాయికి ఉద్యోగం ఉందా?" అని అడిగే వా ళ్ళేకరు. "కాస్త పొట్టి! మా అబ్బాయికి పొడుగైన పెళ్ళాం కావాలి."

"అమ్మాయి ఉద్యోగం చేయరాదు. మా వాడికి సేవలు చేస్తూ ఇంట్లో ఉండాలి. ఇష్టమేనా?"

"డిగ్రీతో చదువు ఆపేశా రేం? ఎమ్మే అన్నా చదివించకపోయారా? మా వాడికి పోస్టు గ్రాడ్యుయేట్స్ నంబంధాలు చాలా వస్తున్నాయి."

ఇది ఉంటే అది లేదని, అది ఉంటే ఇది లేదని, రెండూ ఉంటే ఉన్నాయే అని.

ఎప్పుడూ మగపిల్లలదే పైచేయిగా ఉంటోంది. ఆడపిల్లలకు, వాళ్ళను కన్న తల్లితండ్రులకు కోరికలు, అభిరుచులు లేవా? అయినా అవి లేవని, ఇవి లేవని అభ్యంతరాలు లేవదియ్య రేం? అన్నింటికీ రాజీపడత రేం?

"ఆడపిల్ల, మగపిల్లవాడు అన్న తేడా లుండవని, నమాజం మారుతుం దని అన్నారుగా? ఎంత మారిందో చూశారుగా? మా కాలంలోనే మేలు. కట్నా మొక్కటే సమస్య. కానీ ఇవాళ? ఆడదానికి ఎన్ని క్వాలిఫికేషన్స్ కావాలో చూశారా? చదువుకోవాలి, అందంగా ఉండాలి, ఉద్యోగం చేయాలి, ఇంట్లో పూజలూ వ్రత లూ చేయాలి, బయట భర్తతో పార్టీలకు అటెండ్ కావాలి, పిల్లల్ని కనాలి, పెంచాలి. భర్తకు, అత్తమామలకు సేవచేయాలి, తండ్రి ఇచ్చిన కట్నంతోపాటు నంపాదించిన జీత న్ని కూడా భర్తకే ఇవ్వాలి. స్త్రీ స్వేచ్ఛను పొందుతున్నదో, మరిన్ని బేడీలను చేతులకి, నోటికి తగిలించుకుంటున్నదో నా కర్థం కావడం లేదు. అరుణకు పె ళ్ళిలా చేస్తారో చేయండి." విసిగిపోయిన శాంతి ఛాలెంజ్ చేస్తున్నట్లు అంది.

అయినా, ఆశా నా దృక్పథం మారలేదు.

అరుణకు ఎన్నో నంబంధాలు చూశాను.

చాలా నంబంధాలు 'జాతకాలు కుదరలేదు' అన్న మిషతో తప్పిపోయాయి.

కొన్ని నంబంధాలు 'ఇచ్చి పుచ్చుకునే బేరాల' దగ్గర బెడిసికొట్టాయి.

నాలో నిరాశ ఆవహిస్తున్న నమయంలో జగన్నాథం ఆ నంబంధం తెచ్చాడు.

ఆడపిల్లల , ఆశలతో, వారి తల్లితండ్రుల ఆశక్తతో వ్యాపారం చేస్తూంటాడు జగన్నాథం. వ్యాపారి కనుక లాభం పొందటం అతని లక్ష్యం. అంతే కాని ఒకరి లాభం కోనం ఏ పనీ చేయడు.

అతని వల్ల ఎందరికో పెళ్ళి ళ్ళయిన మాట నిజమే! కానీ అందులో నుఖపడేవాళ్ళ కన్నా జీవితంతో రాజీపడి దాంపత్యాన్ని ఏదో సెంటిమెంట్‌తో నెట్టుకు వస్తున్న వారి నంఖ్యే అధికమని చెప్పుకుంటారు.

ఇవన్నీ నాకు తెలును.

అయినా నేనూ ఒక అశక్తుడనే కదా? ఆశతో అతడిని నమ్మక తప్పలేదు.

పిల్లవాడు ఇంజనీర్‌గా బొంబాయిలో ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పిల్లవాడి తండ్రి లెక్చరర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆస్తి ఉంది.

అయినా అబ్బాయికి ఇన్నేళ్ళు ఎందుకు పెళ్ళి కాలేదు?

"ఎందుకంటే అన్ని అట్టహాసాలు నమకూర్చుకుని కాని ఆ అబ్బాయి పెళ్ళి చేనుకోదలుచుకోలేదు. బొంబాయిలో ఫ్లాట్ కొన్నాడు. టీవీ, ఫ్రిజ్, మారుతీ కారు ఇవన్నీ కొన్నాడు. అదంతా ఎందుకు? నీ కూతురు అదృష్టం బాగుండి ఇంతకాలం చేనుకోలే దనుకోరాదూ? దేనికైనా రాసిపెట్టి ఉండాలయ్యా! అతని ఐశ్వర్యాన్ని, హోదాని అనుభవించే అదృష్టం నీ కూతురికి రాసిపెట్టి ఉంది. అందుకే పెళ్ళి చేనుకోవా లని అతని కిప్పుడు బుద్ధి పుట్టింది" నోరూరించి నా నోటికి తాళం వేశాడు జగన్నాథం.

ఎన్నిసార్లు వెళ్ళినా అ అబ్బాయి తండ్రి నాకు కాలేజీలోనో, హోటల్లోనో దర్శనం ఇచ్చాడు కాని, ఒక్కసారీ ఇంటికి రమ్మన లేదు. జగన్నాథం తీసుకెళ్ళ లేదు.

"జగన్నాథం గారూ! ఒకసారి మనం వా రింటికి వెళ్ళి రామ్మూర్తిగారిని, ఆయన భార్యగారిని అమ్మాయిని చూనుకోటానికి రమ్మని ఆహ్వానిస్తే బాగుంటుందేమో?"

"అక్కర్లేదయ్యా! అలాంటి ఛాందనత్వాలు ఆయనకు గిట్టవు. అయినా ఆయన భార్య ప్రస్తుతం హైదరాబాద్ దగ్గర ఏదో బిఇడి టీచర్ ఉద్యోగం చేస్తున్నదిలే. ఈయనే వారాని కో సారి వెళ్ళి వస్తూంటాడు. అనలు, పిల్ల ఆయనకి నచ్చితే చాలు. పె ళ్ళయిపోయినట్లే. అయినా రేపు ఆయన రెండో కొడుకు, కోడలు కొచ్చిన్ నుంచి వస్తారులే. అప్పుడు వాళ్ళతో వచ్చి అమ్మాయిని చూస్తారు. నరేనా?"

రామ్మూర్తి గారికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. బొంబాయిలోని చివరి కొడుక్కి తప్ప మిగతా వా రందరికీ పెళ్ళయింది. అయినా ఆయన ఎప్పుడూ కొచ్చిన్ కొడుకు, కోడల్ని గురించి తప్ప మిగతా వా రెవరి గురించీ మాట్లాడడు.

"మన కెందుకయ్యా ఆ చరిత్రలన్నీ? నీ క్కావాల్సింది ఉద్యోగం చేసి, బాగా నంపాదించుకుంటున్న అల్లుడా లేకపోతే ఆ అబ్బాయి సోదర సోదరీమణుల చరిత్ర? పిచ్చి పిచ్చి ఆలోచనలు చేసే అమ్మాయికి ఇంతవరకూ పెళ్ళి చేయలేకపోయావు?"

నా బలహీనతపైన చావు దెబ్బ కొట్టాడు జగన్నాథం.

పెళ్ళి కొడుకు లేకుండా పెళ్ళి చూపులు జరిగిపోయాయి.

పిల్ల వారికి నచ్చింది.

"పిల్లను పిల్లవాడు, పిల్లవాడిని పిల్ల చూనుకోకుండా పెళ్ళి చూపు లేమిటండీ నా శ్రాద్ధం. ఇ దేదో లిటిగేషన్ వ్యవహారంలా ఉంది. ఈ నంబంధం నా కిష్టం లేదు." శాంతి తెగేసి చెప్పింది.

"కానీ నా కిష్టమే నమ్మా! పూర్వం మహామహా రాజులు రాణులు చిత్రపటాలను చూసి ప్రేమించుకునేవారు. పెళ్ళిళ్ళు చేనుకునేవారు. అతని ఫొటోను నేను చూశాను. నా ఫొటోను అతను చూసే ఉంటాడు. మే మిద్దరం ప్రేమించి పెళ్ళి చేనుకుంటున్నాం అనుకోరాదూ?"

తన పెళ్ళి చేయటం కోనం నేను పడుతున్న శ్రమను చూసి అరుణ మననులో బాధపడుతున్న దని నాకు తెలును. కష్టాల నుంచి నన్ను గట్టెక్కించటానికి అలా అనటంలేదు కదా?

## హమేషా తమాషా

### ఉడికించిన కోడిగుడ్డు

గట్టిగా ఉడికించి చల్లబరిచిన కోడిగుడ్లు కొన్ని పచ్చి కోడిగుడ్లు కొన్ని కలిపి మీ స్నేహితుల ముందు పెట్టి "పగలగొట్టకుండా వీటిలో ఏది పచ్చివో, ఏవి ఉడికించినవో చెప్పగలరా?" అని నవాలు చెయ్యి.

వాటిని ముట్టుకుని చూస్తారు కొందరు - రెండూ చల్లగానే ఉంటాయి కనుక ఈ టెస్టు పనికిరాదు.

చెవి దగ్గర పెట్టుకుని అటూ ఇటూ ఆడించి చూస్తారు. దీనివల్లా లాభం లేదు.

నీళ్ళలో వేసి తేలుతా యో, మునుగుతా యో చూడబోతా రు. దీనివల్ల కూడా ఏమీ తెలియదు.

వాళ్ళు ఓటమిని అంగీకరించిన తరువాత నువ్వు ఒక్కొక్క గుడ్డునే తీసుకుని బొంగరంలాగ నేలమీద తిప్పడానికి ప్రయత్నించు. గిర్రుమని బొంగరంలాగ చాలాసేపు తిరిగినది ఉడికించిన గుడ్డు అనీ, తిప్పబోతే ఒక్క చుట్టుకూడా సరిగ్గా తిరగకుండా మొరాయించినది పచ్చి గుడ్డు అనీ చెప్పెయ్యవచ్చు! ఈ టెస్టు నూటికి నూరు పాళ్ళూ నిజమై తీరుతుంది.

దీనికి కారణం ఉంది. ఉడికించిన కోడిగుడ్డులోని సొన అంతా ఒకే ఒక ఘనపదార్థంగా ఏర్పడుతుంది కనుక బొంగరంలా తిరుగుతుంది.

పచ్చి కోడిగుడ్డు లోపల చిక్కని ద్రవం ఉండడంచేత తిప్పబోతే ఏక ఖండంగా తిరగదు. గుల్లకి దగ్గరగా ఉన్న ద్రవం తిరగబోతుంది కాని, మధ్యలో ఉన్న ద్రవం తోడి రాపిడివల్ల నిరోధిత మవుతుంది. తిప్పడానికి ఉపయోగించిన శక్తి అంతా ద్రవం మధ్య ఘర్షణలవల్ల వ్యర్థమైపోతుంది.

డా. మహీధర నళినీమోహన్

అరుణ పట్టుబడ్తేనే నేను బేరసారా లాడటానికి రామ్మూర్తి వద్దకు వెళ్ళాను.

"నాకు కట్నా లంటే ఇష్టం లేదండీ బావగారూ! నా స్టేటస్, మా వాడి స్టేటస్ చూస్తున్నారు కదా! మీకు ఎంత ఇవ్వాలనిపిస్తే అంత ఇవ్వండి. మా సెకండ్ సన్‌కి కూడా అలాగే ఇచ్చారు కృష్ణబ్రహ్మం బావగారు. కానీ మా తాహతుకు తగ్గట్లు మాకు మర్యాదలు జరపించండి. అది మాత్రం తప్పదు. ఎందుకంటే కట్న కానుకలకన్నా నేను మర్యాదలకు ప్రాధాన్య మిచ్చే మనిషిని. ఇం తెందుకు? కృష్ణబ్రహ్మం బావగారి నడిగి ఆయన జరిపించినట్లే మీరు అన్ని విషయాలూ నడిపించండి."

కృష్ణబ్రహ్మం గారి లిస్టు చూశాక నాకు గుండె అదిరింది.

కట్నం అక్కర్లే దన్నా రన్న పేరే కానీ, అన్నీ కలిపి తడిసి మోపెడయింది. అంత భారాన్ని మోయగల శక్తి నాకు లేదు.

కానీ ఇంత దూరం వచ్చి వెనక్కి పోతే ఎలా?

మరో సంబంధానికి మళ్ళీ ఇన్ని కష్టాలు పడక తప్పుతుందా?

ముహూర్తాలు పెట్టుకొచ్చాను. కానీ కట్నం సంగతి శాంతకి కానీ, అరుణకి కానీ చెప్పలేదు.

కూడబెట్టిన డబ్బంత తీశాను. చేయగలిగి నన్ని అప్పులు చేశాను.

అయినా ఇంకా కొంత మొత్తం బడ్జెట్‌లో లోటుగానే ఉంది.

ఎలాగా అని మథనపడుతుండగా ఒక మిత్రుడు సొల్యూషన్ చూపించాడు.

ఆ మిత్రుడు బాంక్‌లో పనిచేస్తుంటాడు. బాంక్‌లు స్కూటర్లు, ఫ్రిజ్‌లు కొనటానికి అప్పు లిస్తాయి ఉద్యోగులకు. ఆ అప్పుకు అప్లై చేశాను.

స్కూటర్‌ని ఎవరికో తగ్గింపు ధరకు అమ్మటం లాంటి లావా దేవీ లన్నీ తనే చూసుకుంటా నన్నాడు ఆ మిత్రుడు.

నిన్ననే డబ్బు రావల్సింది. కానీ కుదరలేదు.

"ఏమండోయ్ ప్రభాకర్‌గారూ!"

బాంక్ మిత్రుడే. స్కూటర్ కొనబోయే వ్యక్తిని పరిచయం చేశాడు.

కాగితాల మీద సంతకాలు చేశాను. స్కూటర్ లోన్‌గా నాకు శాంక్షన్ అయిన మొత్తంలో కొంత శాతం తగ్గించి ఆ వ్యక్తి నాకు కాష్ ఇచ్చాడు.

"థాంక్స్! వస్తానండీ!" ఇద్దరి వద్ద సెలవు తీసుకుని రైలు స్టేషన్‌కి పరుగు తీశాను.

అంతకు ముందే అక్కడికి దగ్గరగా ఏక్సిడెంట్ ఏదో అయిందట!

చాలాసేపు నిద్ర పట్టలేదు నాకు.

ఇన్నాళ్ళు డబ్బు సమకూర్చుకోవటంతోనే సరిపోయింది. ఇంతవరకూ పెళ్ళి ప్రయత్నాలు ఒక్కటీ చేయలేదు.

ఆ ఏర్పాట్లని గురించి ఆలోచిస్తూ ఉండగా ఎప్పుడో నిద్ర పట్టింది.

అంతలోనే తలుపు తట్టిన శబ్దం వినిపించి మెలుకువ వచ్చింది.

ఈ సమయంలో నా కోసం వచ్చే చుట్టం ఎవరబ్బా?

"ఎవరు?" తలుపు తెరవకుండానే అడిగాను.

"ఆడపిల్లను. ఆపదలో ఉన్నాను. హెల్ప్ ప్లీజ్! ప్లీజ్!"

టైం చూసుకున్నాను. పదకొండు గంటలు!

తలుపు తెరవగానే రొప్పుతూ ఒకమ్మాయి లోపలికి వచ్చింది.

పట్నం వాసపు గాలి సోకిన పల్లెటూరి అమ్మాయిలా ఉంది.

సంప్రదాయ పద్ధతుల్ని సినిమా ఫేషన్స్‌ను మిళితం చేసిన అలంకరణలో ఉంది.

"ఎవ రమ్మా నువ్వు?"

"మాది పక్క ఊరండీ! మధ్యాహ్నం పనుండి ఈ ఊరు వచ్చాను. తిరిగి వెళ్ళా లంటే రైళ్ళు లే వన్నారు. ఈలోగా రౌడీలు నా వెంట పడ్డారు. వాళ్ళను తప్పించుకుని పారిపోయి వస్తున్నాను. ప్లీజ్! ఈ రాత్రికి నాకు మీ ఇంట్లో ఆశ్రయం ఇవ్వరూ?"

నా కా అమ్మాయి మాటల్ని నమ్మబుద్ధేయలేదు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టాను.

రైలు స్టేషన్‌కి దగ్గరగా ఇల్లున్న ఒక పల్లెటూరు ఆమెది. దాదాపు వారానికి రెండు సార్లన్నా ఇక్కడికి సినిమాలు చూడటానికి వస్తారు. మధ్యాహ్నంగా వచ్చి మేట్నీ మొదటి ఆట చూసుకుంటారు. తొమ్మిదిన్నరకు రైలుంది. అందులో ఇంటి కెళ్తారు. ఎప్పుడూ నలుగు రైదుగురు కలిసి వస్తారు. కానీ ఈ రోజు స్నేహితురాళ్ళు ముందుగా వచ్చారు. ఈమె వెనుక బయలుదేరింది. రెండు సినిమా హాళ్ళ దగ్గర ఆమెకు వాళ్ళు కనబడలేదు. రైలు స్టేషన్ కొస్తే రైళ్ళు లేవని తెలిసింది. రైలు స్టేషన్‌లో ఒంటరిగా ఏం చేయాలో తోచక రెండో ఆటకని రిక్షాలో బయలుదేరింది. స్నేహితురాళ్ళు సినిమాహాల్లో కనిపించవచ్చు గదా? మధ్యలో రిక్షాను అటకాయించి నలుగురు రౌడీలు ఆమెను దించారు. ఆ నలుగురి బారి నుండి తప్పించుకుని పరిగెత్తుకుంటూ వచ్చింది.

సినిమా పిచ్చిలో పడి పల్లెటూరి ఆడవాళ్ళు సైతం నగలు పెట్టుకుని ఒంటరిగా రాత్రిళ్ళు ఇలా తిరగడం ఏమిటి? దొంగతనాలు, మానభంగాలు, హత్యలు జరిగాయంటే జరగవూ?

"సార్! నన్ను అనుమానిస్తున్నారా? నేను పరువు గల కుటుంబ స్త్రీని సార్! స్నేహితురాళ్ళు కనిపించకపోబట్టి ఇవాళ నా కీ ప్రమాదం వచ్చి పడింది. ఈ రాత్రికి మీరే నన్ను రక్షించాలి సార్! ఇప్పుడు ఎక్కడికీ పోలేను."

నాలో మానవత్వం నన్ను కరిగింపచేసింది.

"కానీ ఇంట్లో ఎవ్వరూ లేరు. నే నొక్కడినే ఉన్నాను. పడుకోటానికి ఒక్క గదే ఉంది."

"పరవాలేదు సార్! నేను వంటగదిలో పడుకుంటాను."

నేను మరింత కరిగిపోయాను. ఆమెను గదిలో పడుకోమని నేను చాప, దిండు వేసుకుని వరండాలో పడుకున్నాను.

తెల్లవారి లేచేసరికి తలుపులన్నీ తెరిచి ఉన్నాయి.

బీరువాకు తాళం వేసి దాచిన డబ్బు మాయమైంది.

నా విశ్వాసాలు, సిద్ధాంతాలు నన్ను చూసి మరోసారి నవ్వాయి!

** ** **

పెళ్ళి ఏర్పాట్లన్నీ ఎలాగోలా జరిగిపోయాయి.

వారికి కట్నంగా ముట్టచెప్పటానికి మాత్రం నా దగ్గర డబ్బు లేదు.


తీరా సమయానికి వా రేం గొడవ చేస్తారో? పీటల మీద పెళ్ళి కట్నం మూల ంగా ఆగిపోదు కదా?

పెళ్ళి వా రొచ్చారు. ముహూర్తం దగ్గరపడుతోంది.

జగన్నాథం గా రొస్తే ఆయనతో చెపుదా మనుకున్నాను. ఆయన రాలేదు.

పోనీ కాబోయే వియ్యంకుడి గారినే అడిగితే? విషయం చెప్పి తర్వాత ఎలాగో డ బ్బిస్తా నంటే ఊరుకోడా?

సినిమాల్లో పెళ్ళికొడుకు తండ్రిలా కాదంటే ఎంత అభాసు?



ఎటూ తేల్చుకోలేక మల్లగుల్లా పడుతుండగా ఒక పెద్ద మనిషి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. రాగానే నా వివరాలన్నీ అడిగాడు.

"మీరు నన్నూ మా అమ్మాయినీ క్షమించాలి ప్రభాకర్‌గారూ!"

"క్షమించాలా? అసలు మీ రెవరో, మీ అమ్మాయి ఎవరో ..."

"నాలుగు రోజుల క్రితం ఒక రాత్రి రౌడీలు తరుముకొస్తున్నా రంటే మీరు ఒకమ్మాయికి ఆశ్రయం ఇచ్చారు కదా? ఆమె నా కూతురు."

"మీ కూతురా?"

"అవును. మీ డబ్బు ఇదుగో! దయచేసి స్వీకరించి మా అమ్మాయిని క్షమించండి!" ఆయన బాంక్ నుంచి నేను తెచ్చిన నోట్ల కట్టల్ని నా చేతిలో పెట్టాడు.

నా కళ్ళను, చెవుల్ని నేను నమ్మలేకపోయాను. ఇది భ్రమా? నిజమా?

"మీరు అమ్మాయిని వెతుక్కుంటూ మా ఊరు వస్తా రనుకున్నాం అంతా అలాగే వస్తూంటారు. మీరు రెండు మూడు రోజులైనా రాకపోవడంతో అమ్మాయి నుంచి బలవంతంగా మి అడ్రెస్ తెలుసుకున్నాను. తీరా విచారిస్తే మీ అమ్మాయి పెళ్ళని తెలిసింది. ఆ డబ్బును బాంక్‌లో నుంచి తెచ్చారని కూడా తెలిసింది. పెళ్ళికి ముందు మీకు డబ్బు అందజేయగలుగుతానో, లేదో అని భయపడ్డాను. కానీ అదృష్టవంతుడిని ముందుగానే రాగలిగాను. ఇక నాకు సెలవిప్పిస్తే వెళ్ళివస్తాను."

"కానీ ... కానీ ... ఇదంతా నాకు అగమ్యగోచరంగా ఉంది."

"సహజం. కానీ నా కిది మామూలే. మా అమ్మాయి అసలు దొంగ కాదు. దొంగ బుద్ధి లేదు. దొంగతనం చేయాల్సిన అవసరమూ లేదు. మాది సంపన్న కుటుంబం. గౌరవప్రదమైన వంశం. అమ్మాయి చదువుకుంది, బుద్ధిమంతురాలు. కానీ ఆమెకు 'థ్రిల్లర్' నవలలు చదివే పిచ్చి పట్టుకుంది. మన తెలుగు దేశం కర్మకాలి ఆడవాళ్ళు కూడా హత్యలు, దొంగతనాల నవలలు రాసిపడేస్తున్నారు కదా! వారిలో ఒకామె మా అమ్మాయి అభిమాన రచయిత్రి. ఆ రచయిత్రిగారు తన హీరోయిన్స్ చేత ఏం చేస్తే తనూ అవి చేస్తుంటుంది. అదీ ఆమె సరదా. ఆ రచయిత్రిగారి లేటెస్ట్ నవలలో హీరోయిన్‌గారు మా అమ్మాయి ఆడినట్లు నాటకం ఆడి ఎవరినో బుట్టలో వేసుకుని దొంగతనం చేసి పారిపోతుందట. ఆ టెక్నిక్ మీ మీద ప్రయోగించింది."

నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

"ఎలాగూ ఇంతదూరం వచ్చారు కదా? ముహూర్తం దగ్గర పడుతోంది. మీరు నూతన దంపతులను ఆశీర్వదించి వెళ్తే సంతోషిస్తాను."

"అందుకు అభ్యంతర మేముంది? కానీ సరిగ్గా అదే సమయానికి మేము ఇక్కడికి దగ్గర్లోని ఒక ఊరికి వెళ్ళాలి. మా అబ్బాయికి పెళ్ళి కూతురు కోసం అన్వేషిస్తున్నాం."

ఆయన చెప్పేది పూర్తి కాక ముందే మా చుట్టాలలో ఒకామె నన్ను పిలిచింది.

"ఒరేయ్ ప్రభాకరం! ఇలా రా! నీతో అర్జెంటుగా మాట్లాడాలి."

"ఏమిటి పిన్నీ?"

మా పిన్నమ్మ వాళ్ళు హైదరాబాద్‌లో ఎక్కడో ఉంటున్నారు. పెళ్ళికని వచ్చారు. వియ్యాలవారిని చూడటానికి విడిదింటికి వెళ్ళి వస్తున్నారు.

"ఒరేయ్! చూసి చూసి అరుణకు మంచి సంబంధం పట్టుకొచ్చావురా! ఆ రామ్మూర్తి సంబంధం నీ కెలా తెలిసింది?"

"వాళ్ళ కేం పిన్నీ! ఆయన లెక్చరర్! పెళ్ళి కొడుకు ఇంజనీర్!"

"చదువులు, ఉద్యోగాల కేం లే! సంస్కారం లేకపోయాక అవన్నీ తగలబెట్టనా?"

"అంటే..."

వివరంగా చెప్పింది పిన్ని -

"ఈ ఫొటో చూడు. రామ్మూర్తి గారి ఫామిలీ ఫొటో. అవునా? ఇందులో ఉన్న రామ్మూర్తి గారి భార్య మా ఊళ్ళో ఉంటోం దిప్పుడు. మా పక్క పోర్షన్. చాలా ఉత్తమురాలు. అయినా మొగుడిన్ని వదిలేసి దూరంగా వచ్చి ఉద్యోగం చేసుకు బ్రతుకుతోంది. ఎందుకో తెలుసా? అతను పెట్టే మానసిక హింసను భరించలేక."

"నా కిదంత తెలియదు పిన్నీ!"

"ఏ మగాడూ తన బలహీనతను చెప్పుకోడురా. రామ్మూర్తి భార్య అతిలోక సౌందర్యవతి. అదే ఆమె పాలిట శాపం అయింది. రామ్మూర్తి భార్య అందాన్ని అందరికీ ప్రదర్శింపచేసేవాడు. ఇంటికొచ్చి ఆమె వారిని చూసిందని, వీరిని చూసిందనీ హింసించేవాడు. ఆ మహాతల్లి తన కూతురి కోసం మొగుడు పెట్టే హింసల్ని అనుభవించి అనుభవించి కూతురికి పెళ్ళి కాగానే ఆ చెర నుంచి బయటపడి వచ్చింది. కూతురు, పెద్దకొడుకులది తల్లి పోలిక. రెండో కొడుకు, పెళ్ళి కొడుకుదీ అన్నీ అబ్బ బుద్ధులు. ఈ సంగతి తెలిసే ఎవరూ వాడికి పిల్ల నివ్వటానికి ముందుకు రాలేదు."

"ఇప్పు డేం చేద్దాం పిన్నీ!" నా తల తిరిగిపోతోంది.

"అరుణ అందగత్తెరా. ఆ పిల్లవాడు అనుమానం మనిషి. సంసారం సజావుగా సాగుతుందని నాకు తోచదు. అంతకన్నా కటిక పేదవాడికిచ్చి చేస్తే సుఖిస్తుంది."

"ప్రభాకరంగారూ! మీకు అభ్యంతరం లేకపోతే ఒక చిన్న రిక్వెస్ట్. ఆ ఫొటో ఒకసారి ఇలా ఇవ్వగలరా?" డబ్బిచ్చి వెళ్ళటానికి వచ్చిన పెద్దమనిషి అన్నాడు.

ఇచ్చాను. తీసుకుని చూశా డాయన.

"ఇంకో రిక్వెస్టు. పెళ్ళి కానున్న మీ అమ్మాయిని ఒక్కసారి చూపిస్తారా?"

లోపలికి తీసుకెళ్ళి అరుణను చూపించాను.

"ఇప్పుడు ముచ్చటగా మూడో రిక్వెస్ట్! మీ పిన్నిగారు రామ్మూర్తిని గురించి చెప్పిందంతా నిజమే! నా కతను బాగా తెలుసు. మీ అమ్మాయి నాకు నచ్చింది. మా అబ్బాయికి కూడా నచ్చుతుంది. అయినా వాడు చూడాలి. వెంటనే పెళ్ళి చూపులు ఏర్పాటు చేయగలరా?"

"పెళ్ళి చూపులా?"

"అవును. మా అబ్బాయి, అమ్మాయి, నా భార్య అంతా ఈ ఊరి మొదట్లో కారులో ఉన్నారు. మీకు మొహం చూపించటానికి సిగ్గుపడింది అమ్మాయి. అంచేత వారి నక్కడ ఉంచి వచ్చాను."

అయిదు నిముషాల్లో పెళ్ళి చూపు లయ్యాయి. ఇద్దరూ ఒకరి కొకరు నచ్చారు..

"ఇం కేం? ఈ ముహూర్తానికే పెళ్ళి. విడిది ఇల్లు చూపించండి."

"కానీ అక్కడ ఆ పెళ్ళి వాళ్ళున్నారు కదా?"

"పరవాలేదు. నన్ను చూడగానే రామ్మూర్తి పారిపోతా డు."

"ఇంతకూ మీ రెవరో చెప్పారు కాదు."

"నేను మనిషిని. మానవత్వం ఉన్న మనుషులంటే పడి చచ్చే మనిషిని. రామ్మూర్తి భార్య తరపున లీగల్‌గా కోర్టులో పోరాడి, విడాకు లిప్పించిన లాయర్‌ని. మా వాడు ఐ.పి.ఎస్. ఆఫీసర్. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ వాడి లక్ష్యం. చాలా? ఇంకా చెప్పనా?"

చావటానికి సిద్ధంగా ఉన్న నా ఆదర్శాలు, సిద్ధాంతాలు తిరిగి ఊపిరిపోసుకున్నాయి.

★

